ప్రజాశక్తి

మంగళవారం 24 జూన్ 2025 5 విజయనగరం



2న వర్చువల్ డాక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పోస్టల్ సేవలకు సంబంధించిన ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి జూలై 2న చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్, విజయవాడలో సర్కిల్ స్థాయి ఆన్‌లైన్ డాక్ అదాలత్ ఉదయం 11గంటల నుండి గూగుల్ మీట్ ద్వారా నిర్వహిస్తున్నట్లు విజయనగరం పోస్టల్ సూపరింటెండెంట్ కె .శ్రీనివాస్ తెలిపారు.పోస్టల్ శాఖకు సంబంధించి ఫిర్యాదులను జూన్ 27లోగా చేరేలా పోస్ట్ ద్వారా ఎస్.నీలంరాజు రంగారావు, అసిస్టెంట్ డైరెక్టర్ (పబ్లిక్ గ్రీవెన్స్), చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, ఎ సర్కిల్, విజయవాడ-520013కు పంపవచ్చునని తెలిపారు. జులై 2 ఉదయం 11 గంటలకు చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయంలో నేరుగా కూడా హాజరై ఫిర్యాదులు సమర్పించవచ్చని తెలిపారు. డాక్ అదాలత్ ను వర్చువల్‌గా గూగుల్ మీట్ లింక్ ద్వారా నిర్వహిస్తు న్నారని, ఫిర్యాదుదారులు https:// meet.google.com/uxo-yocn-rdh లింకు ద్వారా సమస్యలను తెలియజేయవచ్చునని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

- పస్తులతో పని చేయాల్సిందేనా? : స్కూల్ ఆయాలు, మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన
- బేసిక్ వేతనం పెంచాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు..

జీవో 14ను రద్దు చేయాలని తాటిపూడి రైతులు ధర్నాలు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న తాటిపూడి రైతులు, రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పాఠశాలల ఆయాలు సిఐటియు ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద వర్షంలో తడుస్తూ ధర్నాచేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ నెలల తరబడి జీతాలు బిల్లులు చెల్లించక పోవడంతో పస్తులతో పనిచేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు పునః ప్రారంభమైన నేటికి మార్చి, ఏప్రిల్ బిల్లులు, గౌరవ వేతనాలు మంజూరు కాలేదని, ఆయాలకు మార్చి,ఏప్రిల్, మే జీతాలు రాలేదన్నారు. అప్పులు చేసి ఎంతకాలం పెట్టగలమన్నారు. ప్రస్తుతం ధరల్లో మెనూ చార్జీలు పెంచకపోతే మంచి భోజనం సాధ్యం కాదని, కనీసం విద్యార్థికి 20 రూపాయలు మెనూ చార్జీలు పెంచాలన్నారు. ఉపాధి హామీ కూలీకి రోజుకు రూ.200 నుంచి రూ.300 వస్తుందని, వృద్ధాప్య పెన్షన్ నెలకు రూ.4000, వంటమ్మలకు మాత్రం రోజుకు 100 రూపాయలు చొప్పున నెలకి 3000 చెల్లించడం దారుణమన్నారు. కనీసం గౌరవ వేతనం రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూల్ ఆయాలను పార్ట్ టైం వర్కర్లని నియమించి ఫుల్ టైం పని చేయిస్తున్నారని, పట్టణాల్లో రూ.6వేలతో బతకడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కనీసం గౌరవ వేతనం 10000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్ లు రద్దు కోసం జులై 9న జరిగే సమ్మెలో పాల్గొంటున్నామని తెలిపారు. అనంతరం గ్రీవెన్స్‌లో డిఆర్‌ఒకు వినతి అందజేశారు. కార్యక్రమంలో వై.నందిని, పార్వతి, మంగ లక్ష్మి, ఉమా, ఆదిలక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలు

మున్సిపల్ ఇంజినీరింగ్‌కార్మికుల ధర్నా

మున్సిపల్ ఇంజనీరింగ్ వాటర్ వర్క్స్, పర్యావరణ, ఎలక్ట్రికల్ , నాన్ పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహ్రనావు మాట్లాడుతూ జీతాలు పెంచుతూ ప్రభుత్వం తక్షణమే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటర్మెంట్ బెనిఫిట్, 62 సంవత్సరాల వరకు కొనసాగింపు, థర్డ్ పార్టీ కార్మికులకు అప్కాస్ కార్మికులతో సమానంగా వేతనాలు ప్రతినెల 10వ తేదీలోపు చెల్లించాలన్నారు. లేబర్ కోడ్స్ అమలు తక్షణమే నిలిపేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా జులై 9న జరుగుతున్న సమ్మెలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొంటున్నారని తెలిపారు. ధర్నా లో యూనియన్ నాయకులు ఎస్.రామనాయుడు, ఎస్.రాజు, ఆదినారాయణ, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

జీవో 14ను రద్దు చేయాలని రైతు సంఘం ధర్నా

తాటిపూడి రిజర్వాయర్ నుంచి జిందాల్ భూముల్లో చిన్న పరిశ్రమలకు నీరు ఇవ్వటానికి జారీ చేసిన జిఒ 14ను రద్దు చేయాలని, రిజర్వాయర్ కింద చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ రిజర్వాయర్ పరిధిలో సక్రమంగా నీరు అందక పంటలు దెబ్బతినీ రైతులు నష్ట పోతున్నారని, ఈ పరిస్థితిలో ప్రభుత్వాలు వున్న నీటిని పరిశ్రమలకు ఇస్తూ ఇప్పుడు ఇంకా జిందాల్ భూములు లో చిన్న పరిశ్రమలకు నీరు ఇవ్వటానికి జిఒ విడుదల చేయడం అన్యాయమని అన్నారు. విశాఖ జివిఎంసి అధికారులు, ఇరిగేషన్ అధికారులకు, రైతులకు 2012 లోక్ అదాలత్‌లో ఇచ్చిన ఒప్పందం అమలు చేయాలన్నారు. తక్షణమే ఖరీఫ్‌కు సక్రమంగా చివరి ఆయకట్టువరకు నీటి పంపిణీ చేయాలని కోరారు. ధర్నాలో జామి మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు, మాజీ ఎంపిపి గొర్లె రవి, కొత్తపల్లి ఎర్నినాయుడు, గులిపిల్లి జయపాల్, మాజీ హెచ్‌ఎం కోడెల ముత్యాల నాయుడు, కోడెల శ్రీను, వసాది సర్పంచ్ రమణ, వసాది ఎంపిటిసి నాయుడు, చింతడ సర్పంచ్ సుబ్రమణ్యం, కృష్ణమూర్తి, సర్పంచ్ అప్పారావు, మధుపాడ సర్పంచ్ శ్రీరామ్మూర్తి, గనివాడ సన్యాసి నాయుడు, రామసత్యం, రైతుసంఘం నాయకులు తమటాపు పైడి నాయుడు, రైతులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్పొరేషన్ ఇంజినీరింగ్ కార్మికులు



విజయనగరంలోని ఆయుర్వేద ఆస్పత్రి

ఆయుర్వేద వైద్యానికి మందుల కొరత

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఆయుష్ విభాగంలో మొదటిది హోమియో వైద్యం కాగా రెండోది ఆయుర్వేదం వైద్యం పేరు గాంచాయి. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ఎన్ని మందులు వేసుకున్నా శరీర భాగాలకు ఎటువంటి ఇబ్బంది లేని వైద్యం ఆయుర్వేదం. మొదట్లో ఆయుర్వేద వైద్యానికి రోగులు అంతగా ప్రాధాన్యత ఇచ్చేవారు కాదు. ప్రభుత్వాలు అల్లోపతికి ధీటుగా ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యత కల్పించడంతో రోగులు ఈ వైద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. ఆయుర్వేద వైద్యానికి రాజుల వైద్యంగా పేరుంది. రాజుల కాలం నాటి నుంచి ఇప్పటివరకు ఎక్కువ మంది రాజులు ఆయుర్వేదం వైద్యం చేయించు కుంటున్నారు. అయితే ఆయుర్వేద ఆసప్రతిలో ప్రస్తుతం గగ్గులు, అశ్వగంధం, శతావది, యసమధు లేహ్యాలు, అశ్వ దిష్టాలు (సిరఫ్)తైలాలు మందుల కొరత ఉంది. సుమారు మూడు నెలలుగా వెంటాడుతున్న మందుల కొరత వల్ల రోగులు ఆసుపత్రికి రావడం తగ్గించిస్తున్నారు. ప్రతి రోజూ ఒపి 50 నుంచి 60 వరకు ఉండేది.

గతంతో పోలిస్తే తగ్గిన ఓపి

మందుల కొరత వల్ల రోజుకు 30 మంది ఓపి మాత్రమే వస్తున్నారు. రోగులకు అరకొరగా మందులు ఇవ్వడంతో రోగులు ఆసుపత్రికి వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. అధికారులు స్పందించి ఆయుర్వేదం మందులు తగినన్ని సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఇండెంట్ పంపించాం

జిల్లా కేంద్రం లోని ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో మందుల కొరత వాస్తవమే. మందులు లేకపోవడం వల్ల రోగులు కొంత మేరకు రావడం లేదు. మందులు కావాలని ఇండెంట్ అధికారులు పంపించాం. త్వరలోనే మందులు వచ్చే అవకాశం ఉంది.



ఎం.ఆనంద రావు, సీనియర్ వైద్యాధికారి యుర్వేద ఆస్పత్రి, విజయనగరం



సమవేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ నల్లనయ్య

రూ.3.82 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం రూ. 3.82 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను కమిటీ ఆదేశించింది. నగరంలో రింగ్ రోడ్డు పరిధిలో ఆక్రమణలపై దృష్టి పెట్టాలని సభ్యులు రాజేష్ కోరారు. అనంతరం ఎజెండాలో 13 అంశాల్లో 12 అంశాలను కమిటీ ఆమోదించింది. ఇటీవల యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంగా చేసినందుకు అధికారులను అభినందించారు. అదే క్రమంలో పాలకవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా అధికారులే అన్ని అయి వ్యవహరించిన తీరు సరికాదని సభ్యులు అన్నారు. ఇదే పునరావత్తం

స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చ

అయితే తర్వాత ఎటువంటి కార్యక్రమం జరిగిన పైసా ఇచ్చేది లేదని హెచ్చరించారు. అదే విధంగా ఆర్‌పిలు, సిఒలు కార్పొరేషన్ రుణాలు విషయంలో 5 నుంచి 6 వేలు వసూలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యం పట్ల, వ్యాధులు ప్రబలకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుంకరి నారాయణస్వామి, రేగాన రూపాదేవి, జి.వెంకటరంగరావు , నగర పాలక సంస్థ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ట్రిపుల్ ఐటికి ఇద్దరు విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక బాలికోన్నత పాఠశాలకు చెందిన టెన్త్ క్లాస్ టాపర్స్ గిడిజాల నందిని, నగర రేచల్ ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమేష్ కుమార్ తెలిపారు. ఆర్‌జియు కెటి 2025 ఎంపిక మెరిట్ జాబితాను సోమవారం సాయంత్రం వెల్లడించగా, గిరిజాల నందినికి ఒంగోలు క్యాంపస్, నగర రేచల్ కు శ్రీకాకుళం క్యాంపస్‌లో సీట్లు కేటాయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమేష్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినులను అభినందించారు. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈనెల 30 నుంచి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.



నగర రేచల్



గిరిజాల నందిని

నూజివీడు ట్రిపుల్ ఐటికి శివ ఎంపిక

బలిజిపేట : బొబ్బిలి మండలం కలవరాయి మహాత్మజ్యోతిరావుపూలే పాఠశాలలో పదో తరగతి చదువుకున్న చోడవరపు శివకు నూజివీడి ట్రిపుల్ఐటిలో సీటు లభించింది. బలిజిపేట మండలం అరసాడకు చెందిన శివ టెన్త్‌లో శివ 592 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు జ్యోతి, రాజు వ్యవసాయ కూలీలు. శివకు సీటు రావడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రభుత్వ తీరుపై యువత ఆగ్రహం

హామీలు అమలు చేయాలని కలెక్టరేట్ వద్ద వైసిపి యువత ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యువత, విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం యువత కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్, స్టూడెంట్ విభాగం అధ్యక్షులు కరుమజ్జి సాయి కుమార్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌కౌశిక్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిపెస్టోలో చెప్పిన విధంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన, విద్యాదీవెన కింద ఇవ్వాల్సిన బకాయిల చెల్లింపు, నిరుద్యోగులకు భృతి వంటి హామీలను అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకుండా ప్రభుత్వంలోకి వచ్చి వెంటనే తన కొడుక్కు మంత్రి పదవి ఇచ్చిన చంద్రబాబు, ఈ రాష్ట్ర యువతను గాలికి వదిలేశాడని విమర్శించారు. యువత హక్కుల సాధన కోసం వైయస్ఆర్ కాంగ్రెస్ యువజన విభాగం పోరాటాన్ని మరింత ఉధృతం చేయనుందని హెచ్చరించారు. కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీ కృష్ణ, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంత్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పతివాడ సత్యనారాయణ, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, జిల్లా సోషల్ మీడియా కార్యవర్గ సభ్యులు, 7 అసెంబ్లీ నియోజకవర్గాల అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి యువజన విభాగం నాయకులు, యువకులు



రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బేబినాయన పుట్టినరోజు వేడుకలు సందర్భంగా

పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - బొబ్బిలి

ఎమ్మెల్యే బేబినాయన జన్మదినం సందర్భంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కోటలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రక్తదాన శిబిరాన్ని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని చెప్పారు. రక్తదానం చేసేందుకు యువత, కార్యకర్తలు, అభిమానులు కోటకు పోటెత్తడంతో 210 యూనిట్లు రక్తాన్ని బొబ్బిలి రక్తనిధి, మహారాజ ఆసుపత్రి రక్తనిధి సిబ్బంది సేకరించారు. రక్తదాతలను ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

స్థానిక సిహెచ్‌సిలో ప్రైవేట్ పరిశ్రమ యాజమాన్యం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బేబినాయన ప్రారంభించారు. రోగులు కోసం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. వైద్యులతో మాట్లాడి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు.

ఆస్పత్రికి ఇన్వెర్టర్ వితరణ

ఇందిరమ్మ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి సొంత నిధులతో ఎమ్మెల్యే బేబినాయన ఇన్వెర్టర్లు ఏర్పాటు చేశారు. గతంలో ఆయన ఆస్పత్రిని సందర్శించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్న నేపథ్యంలో, విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు జనరేటర్ లేనందున ఇబ్బంది కలుగుతున్న విషయం ఎమ్మెల్యేకి చెప్పారు. ప్రభుత్వ సహకారంతో వీలైనంత త్వరలో జనరేటర్ ఏర్పాటు చేస్తానని తెలిపి, ప్రస్తుతానికి తన సొంత నిధులతో ఇన్వెర్టర్లను ఏర్పాటు చేశారు. సోమవారం ఆ ఇన్వెర్టర్లను ఆసుపత్రిలో ప్రారంభించారు. త్వరలోనే ఇందిరమ్మ కాలనీకి సోలార్ విద్యుత్ వీధి దీపాలు కూడా ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యకరమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలలో ఉద్యోగాల భర్తీ కి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. భారత ప్రభుత్వం, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్. ఆర్.), చెన్నైలోని రీజినల్ డైరెక్టర్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ 'కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ 2025' కోసం ఈనెల 12 నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో ఉన్న భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/సంస్థలలోని వివిధ గ్రూప్ బి, సిపోస్టులకు ప్రత్యక్ష నియామకం కోసం కమిషన్ ఓపెన్ కాంపిటీటివ్ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహిస్తుందని తెలిపారు. పోస్టుల వివరాలు, వయోపరిమితి, ముఖ్యమైన విద్యార్హత, చెల్లించాల్సిన రుసుము, పరీక్షా పథకం, ఎలా దరఖాస్తు చేయాలి మొదలైన వాటి గురించి సమాచారం కమిషన్ వెబ్‌సైట్ ssc.gov.inలో అందుబాటులో ఉన్న రిక్రూట్‌మెంట్ నోటీసులో వివరంగా ఉన్నాయని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లలో మై ఎస్ ఎస్ సి మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్ మోడ్‌లో సమర్పించవచ్చునని, ఆన్‌లైన్ దరఖాస్తులను జులై 4వ తేది లోగా సమర్పించాలని, రుసుము ఆన్‌లైన్ చెల్లింపు జూలై 5వ తేది లోగా చేయాలని తెలిపారు. ఆగస్టు 13 నుండి 30 వరకు జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 13 కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తారని అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సీజనల్ వ్యాధులు, జ్వరాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆయన ఆదేశాలతో పలు వాటర్ ట్యాంకులను సోమవారం పరిశుభ్రపరిచే కార్యక్రమాలను సిబ్బంది చేపట్టారు. 15 రోజులకోసారి వాటర్ ట్యాంకులను పరిశుభ్రపరిచే కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

నగరపాలక సంస్థ స్థలాలపై వేసిన మెటీరియల్‌ను తొలగించాలి

నగరపాలక సంస్థ స్థలాలను ఆక్రమించి పలుచోట్ల ఇసుక, ఇటుక, పిక్క వంటి వ్యాపారాలను తక్షణమే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. నగరంలో సుమారు 20 ప్రాంతాలలో అనధికార ఇసుక, ఇటుక, పిక్క వంటి విక్రయాలు సాగుతున్నట్లు గుర్తించామని చెప్పారు. వాటిని రెండు రోజుల్లోగా తొలగించే విధంగా సంబంధిత వ్యాపారులకు చెప్పాలని, లేదంటే కేసులు నమోదుచేస్తామని తెలిపారు.

కోళ్ల ఫారాన్ని తక్షణం మూసివేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-మెంటాడ రూరల్

మండలంలోని బిరసాడ వలసలో దుర్గంధం వెదజల్లి ప్రజలకు ,పంటలకు నష్టం వాటిల్లుతున్న కోళ్లఫారాన్ని వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యాన ఆ గ్రామస్తులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాచేశారు. పలు గ్రామాల ప్రజలు మద్దతు తెలిపారు. సుమారు రెండుగంటల పాటు అధికారులను, సిబ్బందిని కార్యాలయంలోనికి వెళ్లకుండా బైఠాయించారు. కోళ్ల ఫారం యజమాని చుట్టుపక్కల చెరువును కూడా ఆక్రమించాడని, వెంటనే చర్యలు డిమాండ్ చేశారు. 20రోజులుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ భానుమూర్తి స్పందిస్తూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో అఖిలపక్ష నాయకులు సబ్బవరపు రాజశేఖర్, వైసిపి నాయకులు రెడ్డి రాజన్నలనాయుడు, టిడిపి నాయకులు ఎం.రామచంద్రరావు, మాజీ సర్పంచ్ గెద్ద లక్ష్మి, సర్పంచ్ బెవర మహేశ్వరి, సిపిఎం నాయకులు రాకోటి రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు. టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, గొర్లె ముసలినాయుడు తదితరులు మద్దతు తెలిపారు.తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ భానుమూర్తి స్పందిస్తూ రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సాయంత్రం బిరసాడ వలస వెళ్లి కోళ్ల ఫారాన్ని పరిశీలించారు.



ధర్నా చేస్తున్న గ్రామస్తులు, అఖిలపక్ష నాయకులు

పిజిఆర్ఎస్‌కు 166 వినతులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్ లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస మూర్తి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 166 వినతులు అందాయి. డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్‌డిఒ సవరమ్మ, పౌర సరఫరాల డిఎం బొడ్డేపల్లి శాంతి , డిఇఒ మాణిక్యం నాయుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 69 వినతులు అందాయి. ఈ సందర్భంగా అధికారులతో డిఆర్ఒ మాట్లాడుతూ ప్రతి రోజూ లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు.

పోలీసు గ్రీవెన్సుకు 49 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్సుకు 43 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో భూ తగాదాలకు సంబంధించి 15 ఉన్నాయి. అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలు విని, పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న డిఆర్ఒ శ్రీనివాసమూర్తి

పరాయి పంచన 'బేసిక్' చదువులు

◆బేసిక్ ప్రైమరీ పాఠశాలలకు భవనాలు కరువు ◆అవస్థలు పడుతున్న చిన్నయ్యపేట,పెద్దశిర్లాం విద్యార్థులు ◆నాడు- నేడు పేజ్2లో పక్కా భవనం మంజూరైనా పూర్తికాని వైనం

ప్రజాశక్తి- రేగిడి

ప్రభుత్వాలు విద్యా విధానంలో మార్పులు తీసుకొస్తున్న తరుణంలో పక్కా భవనాలు లేక పరాయి పంచన బేసిక్ ప్రైమరీ పాఠశాలలు నడుస్తున్న పరిస్థితి దాపురించింది. పక్కా భవనాలు లేక విద్యార్థులు నానా అవస్థలు పడి అద్దె కొంపల్లో ఇరుకు గదులలో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. 2024లో నాడు నేడు పేజ్2లో ఒక్కొక్క పాఠశాలకు రూ.20 లక్షలతో పక్కా భవనాలు మంజూరైనా నేటి వరకు పూర్తి చేయని పరిస్థితి ఉంది. ఈ విద్యా సంవత్సరానికైనా పక్కా భవనాలు పూర్తయి అన్ని సౌకర్యాలు కల్పిస్తారన్న భావనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు.

మండలంలో సంకిలి పంచాయతీ పరిధి చిన్నయ్యపేట, పెద్దశిర్లాం ప్రాథమిక పాఠశాలలు (బేసిక్ ప్రైమరీ పాఠశాలలు) పక్క భవనాలు లేక పరాయి పంచన విద్యార్థులకు విద్యాభ్యాసం చేస్తున్నాయి. ఈ అద్దె భవనంలో సరైన మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ పాఠశాలలు ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించాయి. చిన్నయ్య పేట పాఠశాల శిథిలావస్థలో ఉండడంతో విద్యార్థులపై పెచ్చులూడి గాయాలు పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు గమనించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2021 నవంబర్‌లో శిథిలమైన ఈ పాఠశాలను నేలమట్టం చేశారు. అప్పటి నుంచి ఈ పాఠశాల అద్దె భవనంలోనే కొనసాగుతుంది. అద్దె భవనంలో ఉన్న ఈ పాఠశాలలో మరుగుదొడ్లు, సరైన తరగతి గదులు, వసతి, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారు. నేలమట్టం చేసిన ఈ పాఠశాలలను మనబడి, నాడు- నేడు మొదటి, రెండో విడతలలో పక్కా భవనాలు మంజూరు కాకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలలను నేలమట్టం చేశారే తప్ప. పక్కా భవనం మంజూరు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. అసలు చిన్నయ్య పేట పాఠశాల విద్యాశాఖ అధికారుల దృష్టిలో ఉన్నట్టా? లేనట్టా? అని అనుమానం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో విద్యాశాఖ అధికారులు ఆడుకోవటం తగదని వాపోయారు. మండల విద్యాశాఖ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, ఆందోళన చేసిన అనంతరం 2024లో మనబడి, నాడు- నేడు ఫేజ్ 2లో పక్కా భవనాలు మంజూరు చేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. పనులు ప్రారంభించి సంవత్సరం ఆరు నెలలు పూర్తయిన నేటి వరకు పూర్తికాక అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. సమగ్ర శిక్ష అభియాన్ ఎఇ పర్యవేక్షణ లేకపోవడం, అసలు వస్తున్నారో రారో తెలియని పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఉదాసీనత, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమోగాని అసంపూర్తిగానే పక్కా భవనాలు దీంతో అద్దె కొంపల్లోనే విద్యార్థుల విద్యాభ్యాసం కొనసాగుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, డిఇఒ స్పందించి పక్కాభవనాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని గ్రామస్తులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


అసంపూర్తిగా ఉన్న పాఠశాలభవనం


చిన్నయ్యపేటలో అద్దె కొంపలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు

పక్కాభవనాలు మంజూరయ్యాయి

చిన్నయ్య పేట, పెద్దశిర్లాం బేసిక్ ప్రైమరి పాఠశాలలతో పాటు మరో 41 పాఠశాలలకు పక్కా భవనాల కోసం ప్రతిపాదనలు పంపించాం. అన్ని మంజూరయ్యాయి. ఈ భవనాల నిర్మాణాలు సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

ఎం.వరప్రసాదరావు, ఎంఇఒ రేగిడి

టిఇఒ ద్వారా బదిలీలకు అనుమతి

నాడు -నేడు ఫేజ్ 2 ద్వారా పాఠశాలలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. కొన్ని పాఠశాలలు పూర్తయ్యాయి. నిధులు జమ చేసాం. పూర్తిచేసిన పాఠశాలల నిధులు ఎంత మిగిలి ఉందో ఎంఇఒలకు డిఇఒ ఆదేశించారు. ఆ మిగిలిన నిధులతో అసంపూర్తిగా ఉన్న పాఠశాలల భవనాలకు ట్రాన్స్‌ఫర్ ఎంట్రీ ఆర్డర్‌తో నిధులు మళ్లించి నిర్మాణాలు చేపట్టాలని ఎంఇఒలకు సర్క్యులర్ పంపించాం. ఆ ప్రాప్తికి బిల్లులు చెల్లించి పాఠశాలల పక్కాభవనాలు పూర్తి చేస్తాం.

డాక్టర్ ఎ.రామారావు, ఎపిసి, విజయనగరం

బంగారయ్యకు జాతీయ సేవా పురస్కారం

నెల్లిమర్ల: జరజాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న శిక్షకు బంగారయ్యకు జాతీయ సేవా పురస్కారం లభించింది. బంగారయ్య ఉపాధ్యాయ వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూనే పలు సామాజిక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతూ నిరంతరం సామాజిక, విద్యార్థుల శ్రేయస్సు కోసం పరితపిస్తూ, శ్రమిస్తూ పలువురు మన్ననలు పొందుతున్నారు. ఈ మేరకు ఈయనకు నందమూరి తారక రామారావు జాతీయ సేవా పురస్కారం హైదరాబాదులోని జర్నలిస్ట్ ఫోరం, ఎల్.బి.స్టేడియం దగ్గర గల 'సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం'లో ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఖ్యా శాస్త్ర నిపుణులు శర్మ, సభాధ్యక్షులు - జాతీయ వినియోగదారుల మండలి అధ్యక్షులు, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండలి కృష్ణారెడ్డి, కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు, అసిస్టెంట్ జెనరల్ మేనేజర్ ఎఫ్‌సిఐ పెంటపాటి కృష్ణారావు, హైదరాబాద్ రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ లయన్ నైనా దేవి తదితరులు పాల్గొని బంగారయ్యకు అవార్డు అందించారు.

29న ఆనందోబ్రహ్మ ప్రదర్శనలు

బొబ్బిలి: ఆనందోబ్రహ్మ 45వ ప్రదర్శన జూన్ 29 ఆదివారం సాయంత్రం శ్రీ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆనందోబ్రహ్మ అధ్యక్షుడు ఎం విజయ మోహన్ రావు తెలిపారు. స్థానిక కళాభారతి ప్రాంగణంలో ఆనందోబ్రహ్మ సభ్యులతో కలిసి సోమవారం ఆయన మాట్లాడుతూ 29న జరిగే కళా ప్రదర్శన కార్యక్రమంలో 45 మంది కళాకారులు రెండు గంటలసేపు పౌరాణిక, సాంఘిక నాటికలు, సినీ, శాస్త్రీయ, జానపద నృత్యాలు, ఆధ్యాత్మిక కోలాటాలు, మైమ్‌షో, సినీ సంగీత విభావరి, ఏకపాత్రాభినయాలు ప్రదర్శిస్తారని తెలిపారు. బొబ్బిలి ఎమ్మెల్యే, ఆనందోబ్రహ్మ సంస్థ గౌరవ అధ్యక్షులు బేబినాయన సహకారంతో గత 44 నెలలుగా పౌరాణిక, జానపద, సాంఘిక, చారిత్రక విభాగాల్లో వందలాది కళాకారుల కళా ప్రదర్శనకు అవకాశం కల్పించామని తెలిపారు. సంస్థ సభ్యులు, కళాకారులు జి కిరణ్ కుమార్, టీవీ రమణ, ఎంసిహెచ్ గౌరి నాయుడు, రామ్మూర్తి గోవిందరావు, బి.జీ .గంగాధర్, కె.రామకృష్ణ, జి మల్లేశ్వరరావు, వి. రాంబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బొబ్బిలి: పట్టణంలోని అభివృద్ధి పనులకు మున్సిపల్ ఛైర్పర్సన్ రాంబార్కి శరత్ బాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఫూల్ బాగ్ బైపాస్ రోడ్డులో రూ.6లక్షలతో సీసీ కాలువ మెహర్ కాలనీలో రూ.1లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. బొబ్బిలి పురపాలక సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శంకుస్థాపన చేసిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామ లక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఇంజ నీర్ కోటేశ్వర రావు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జ్‌లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్‌గా నాగరాజు

రామభద్రపురం: స్థానిక ఎస్‌బిఐ నూతన బ్రాంచ్ మేనేజరుగా బొత్స నాగరాజు సోమవారం విధుల్లో చేరారు. బొబ్బిలి అర్బన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బ్యాంక్ ఇంచార్జి హరికృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఖాతాదారుల సేవలో ముందంజలో ఉంటానని, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వ్యవసాయ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, ఉద్యోగ, పారిశ్రామిక రంగాలకు చెందిన రుణాలతో పాటు గృహ, వాహన, విద్యా రుణాలకు ప్రాధాన్యత నిస్తానని తెలిపారు. అత్యధిక డిపాజిట్లు, జీవిత బీమా పథకాలకు తమ బ్రాంచ్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్, సిబ్బంది లక్షం నాయుడు, ధర్మా రావు, శ్రావణి, అరుణకుమారి, ప్రకాశ్, సిఎస్‌పి సత్యారావు పట్నాయక్ పాల్గొన్నారు.

నేడు ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షలు

డెంకాడ: మండలంలోని అక్కివరం వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలోను, భోగాపురంలో ఉన్న ఆదర్శ పాఠశాలలోనూ 7, 8, 9 తరగతులకు ప్రవేశ పరీక్ష మంగళవారం నిర్వహిస్తున్నట్లు భోగాపురం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు 9.30 గంటలకే పాఠశాల వద్దకు చేరుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష రుసుము కట్టిన వారందరూ హాల్ టికెట్లు లేకపోయినా పాఠశాల వద్దకు వచ్చి ఫీజు కట్టిన రశీదు చూపిస్తే చాలన్నారు. అక్కివరం వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 7వ తరగతిలో రెండు సీట్లు 8వ తరగతిలో ఒక సీటు 9వ తరగతిలో ఒక సీటు ఉన్నాయని తెలిపారు.

మండల సర్వేయర్‌గా చందర్‌రావు

రేగిడి: మండల సర్వేయర్‌గా చందర్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ల్యాండ్ ఎక్విజేషన్ సర్వేయర్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ మండల సర్వేయర్‌గా పనిచేసిన అప్పలనాయుడు విజయనగరం జిల్లా తెర్లాం మండల సర్వేయర్ గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సర్వేయర్ చందర్రావు మాట్లాడుతూ భూ రీ సర్వే తమ సిబ్బందితో వేగవంతం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా సచివాలయ సర్వేయర్లు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతించారు.

ఏకలవ్య జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

బాడంగి: ఏకలవ్య జయంతిని ప్రభుత్వమే జరిపించాలని జిల్లా ఏకలవ్య అధ్యక్షులు, గజరాయనివలస ఎంపిటిసి పాలవలస గౌరు కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఏపి ఎరుకల సేవా సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యుల ఆదరణ కలిసి 23 జిల్లాల కలెక్టర్లకు సోమవారం వినతి పత్రాలు అందజేశామన్నారు. ఏకలవ్యని జయంతిని ఆషాఢ మాసం తొలి ఏకాదశి రోజున రాష్ట్రమంతటా తమ ఎరుకల జాతి మొత్తం ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ఏటా వాల్మీకి, గాంధీ, అంబేద్కర్ జయంతులను అధికార లాంఛనాలతో చేస్తుందని అలాగే ఏకలవ్యని జయంతిని కూడా ప్రభుత్వం గుర్తించి అధికార లాంఛనాలతో జరపించాలని కోరారు.

సేవలందించేందుకు హెల్ప్ డెస్క్

బొబ్బిలి: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సేవలు అందించేందుకు హెల్ప్ డెస్క్ ప్రారంభించినట్లు ఎస్‌టిఒ కెవి వర్మనాథం చెప్పారు. ఉప ఖజానా కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లకు సంపూర్ణంగా సేవలు అందించడమే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. పెన్షనర్లు, ఉద్యోగులు ఉప ఖజానా పనుల కోసం మధ్యవర్తులను ఆశ్రయించకుండా ఈ కార్యాలయంలో అందుబాటులో ఉండేందుకు హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతుందని చెప్పారు. బొబ్బిలిలో ఒకే వ్యక్తి రెండు పెన్షన్లు తీసుకోవడంతో రూ.4.04లక్షలు రికవరీ చేసినట్లు చెప్పారు. పెన్షన్లపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

29న సిఐటియు నగర మహాసభ

విజయనగరం టౌన్: ఈనెల 29న సిఐటియు 4వ నగర మహాసభ జరుగుతుందని నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు తెలిపారు. సోమవారం కోట వద్ద కార్మికులతో సిఐటియు నగర కార్యదర్శి బి. రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని, షాపు ఎంప్లాయీస్‌కు కనీస వేతనాల చట్టం సవరణ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు, అధిక ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోజరిగే మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

బొబ్బిలి: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరరావు, తెంటు రవి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నుంచి సమ్మె బాట పట్టారు. మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో సెలవు రోజులలో కూడా పని చేయించుకుని కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి హెచ్.ఆర్.సి అమలు చేయాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయం పరిధిలో గల రైతు సేవా కేంద్రం వద్ద సబ్సిడీపై వరి విత్తనాలను సర్పంచ్ ఎస్ వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కె విఎఎ కోమలి, ఆరిగి పాలెం వైస్ సర్పంచ్ దుల్ల వెంకటరమణ రైతులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి- రాజాం

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు చెల్లించాలని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం ఎంపిడిఒ శ్రీనివాస రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ గ్రామాలను పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడర్లకు మూడు నెలల నుంచి 10 నెలల వరకు బకాయి జీతాలు అందలేదన్నారు. వీరికి ఇచ్చేది కేవలం 6000 మాత్రమే అది కూడా సక్రమంగా ప్రతినెల ఇవ్వకుండా బకాయి ఉంచి కార్మిక కుటుంబాలను పస్తులతో ఉండే విధంగా చేస్తున్నారని చెప్పారు. రోజువారి కుటుంబ సరుకులు, ఇతర అవసరాలు గడవాలంటే ఈ జీతం చాలదన్నారు. ఈ కార్మికులకి కనీసం పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కూడా లేదన్నారు. ప్రభుత్వం పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని, తమ ఆరోగ్యాలను పనంగా పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడడంలో కీలకంగా గ్రీన్ అంబాసిడర్స్ వ్యవహరిస్తున్నారని గుర్తు చేశారు. అటువంటి వారిని పస్తులతో ఉంచడం ప్రభుత్వానికి తగునా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ నాయకులు ఎన్.శివ, ఎం. నాగమణి, శంకర్, భారతి, ధాలయ్య, రాము, మహాలక్ష్మి, చిన్నారావు, పాపారావు, పరశురాం, మంగమ్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

25న గురుకులం ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దగల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో మిగిలి సీట్లు కోసం 6,7,8,9 తరగతులలో ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీన నెల్లిమర్లలో రాత పరీక్షలకు హాజరు కావాలని ప్రిన్సిపల్ టీ జయశ్రీ తెలిపారు. ఆరు, ఏడు తరగుతుల విద్యార్థులకు ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు, 8,9 తరగతులకు అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుండి మూడు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షకు హాజరు కావలసిన విద్యార్థులు బ్లూ, బ్లాక్ పెన్నుతో ఒక ఒక ప్లాంక్‌తో గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు.

జిందాల్ భూసేకరణలో అక్రమాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ భూ సేకరణ సమయంలో కంపెనీ యజమానులు అనేక అక్రమాలుకు పాల్పడ్డారని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జి ఆరోపించారు. మండలంలోని అడ్డతీగ గ్రామంలో భూ నిర్వాసితులతో కలిసి ఆయన సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కిల్తం పాలెం, చీడిపాలెం, పెదఖండేపల్లి, మూల బొడ్డవర, ముసిడిపల్లి ప్రాంతాల్లోని భూమిని 2008లో సేకరించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అల్యూమినా కర్మాగారం ఏర్పాటు కోసం 1048 ఎకరాల 65 సెంట్లను భూ సేకరణ చేసి జిందాల్ యజమానికి ఇచ్చేసిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 17 సంవత్సరాలు కర్మాగారం పెట్టలేదన్నారు. జిందాల్ భూసేకరణ సమయంలో రెవెన్యూ అధికారులు కూడా అధికార రాజకీయ పార్టీల అండతో చెలరేగిపోయారని లోక్ సత్తాపార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ సూచన మేరకు చెల్లింపుల్లో జరిగిన అక్రమాలు అవకతవకల పై రాష్ట్ర ఎసిబి, లోకాయుక్తలో పిటిషన్లను వేసి రైతులకు అండగా నిలబడ్డామని జిందాల్ యాజమాన్యం తీరుతో నేటికీ చాలా మంది భూములు కోల్పోయిన రైతులు డబ్బులు అందక ఆందోళన చెందుతున్నారని గుర్తు చేశారు. జిందాల్ భూ నిర్వాసితులకు తప్పనిసరిగా న్యాయం జరగాలని, భూ సేకరణ సమయంలో జిందాల్ కర్మాగారం యజమానులు ఇచ్చిన ప్రతి హామీని అమలు చెయ్యాలని నిర్వాసితులకు న్యాయం జరగాలంటే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ సమావేశమై రైతులకు న్యాయం చెయ్యాలని భీశెట్టి కోరారు. ఈ సమావేశంలో లోక్ సత్తాపార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కాంద్రేగుల ప్రసాద్, పౌర వేదిక ఉపాధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు, జిందాల్ భూ బాధితులు మోహన్, అప్పారావు, అరుణ, సత్యనారాయణ రాజు, ఒలం మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని సతివాడ చంద్రకళదేవి శారదా డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల అక్రమ వినియోగం, మాదక ద్రావ్యాలు వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ ఎం. వెంకటరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలతో పట్టుపడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, ఎక్సైజ్ ఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

గజపతినగరం: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్.ఐ పి. నరేంద్ర కుమార్ అన్నారు. సోమవారం స్థానిక శ్రీ భవిష్య కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వల్ల కలుగు అనర్థాల గురించి వివరించారు. ఎవరైనా గంజాయి వంటి మత్తు పదార్థాలు స్వీకరిస్తే 14405 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. విద్యార్థి దశ నుండే మాదకద్రవ్యాల పై అవగాహన పెంచుకొని వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

అంబేద్కర్ భారీ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో జ్వాలా ప్రకాష్ అంబేద్కర్ సంఘం మహిళలు, సామాజిక కార్యకర్త ఆర్. అప్పారావు సొంత నిధులతో నిర్మించిన భారీ అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్. సూర్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ అందివాడని అన్నారు. దేశ పాలన సాగించడానికి ఆయన రాసిన రాజ్యాంగమే ప్రధాన ఆధారమని, ఆయన ప్రధాన ఉద్దేశం ప్రతి ఒక్కరూ చదువుకొని స్వశక్తితో ఎదగాలని రాజకీయాలకు బానిసగా మారకూడదని ప్రతిక్షణం బడుగు బలహీన వర్గాల గురించి ఆలోచించిన మహా మేధావి బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె.రాములమ్మ, టిడిపి నియోజవర్గం మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మండల మహిళా సంఘాల అవేర్నెస్ కమిటీ చైర్‌పర్సన్ గొంప తులసి, మండల ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, మండల తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షుడు సిరికి రమణ, గ్రామ సర్పంచ్ ఎస్.వెంకటరావు, సింగరాయి గ్రామ కమిటీ టిడిపి సభ్యులు, బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహం ప్రిన్సిపల్ జయశ్రీ, కెజిబివి వసతి గృహం ప్రిన్సిపల్ కిరణ్మయి, వెలుగు ఎపిఎం సూర్యనారాయణ, ఎపిఒ ఆదిలక్ష్మి, వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎం. వేణు, సిహెచ్ఒ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు సత్యవతి, పద్మ, కాకర భారతి, సింగరాయి గ్రామ సచివాలయ సిబ్బంది, వెల్నెస్ సెంటర్ సిహెచ్ఒ మహిళలు కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న నాయకులు, అధికారులు

హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చింతలవలస 5వ బెటాలియన్ మెయిన్ గేట్ ఎదురుగా విజయనగరం విశాఖపట్నం రహదారిపై కారు ఢీకొని ఎపిఎస్‌పి బెటాలియన్లలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాముడునాయుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం. కోరాడ రామునాయుడు బెటాలియన్ ఎదురుగా సత్యనారాయణపురంలో సొంత ఇల్లు నిర్మించుకుని కుటుంబంతో ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఉద్యోగ నిమిత్తం మోటార్ సైకిల్ పై బెటాలియన్‌లోనికి వెళ్లేందుకు మెయిన్ గేట్ గుండా విజయనగరం విశాఖపట్నం రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి విజయనగరం స్పీడ్‌గా వస్తున్న కారు బలంగా ఢీకొంది. దీంతో రామునాయుడు మోటార్ సైకిల్‌తో సహా ముందుకు తుళ్లి ఎగిరిపడ్డాడు. దీంతో కాళ్లకు చేతులకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు బెటాలియన్ వాహనంలో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం ఆసుపత్రికి తరలించారు. రామనాయుడు తమ్ముడు లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏ సన్యాస నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటల బీమా చేయించుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి- డెంకాడ

కౌలు కార్డులు ఉన్నవారందరూ పంట ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఎఒ సంగీత తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాజారావు ఆధ్వర్యంలో కౌలుదారులకు రెవెన్యూ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సర్వే నెంబర్ ప్రాతి పదికిన 118 మంది రైతులు కౌలు దారులుగా కార్డులు కలిగి ఉన్నారన్నారు. ఎల్‌పిఎం ప్రాతిపదికిన మరో రెండు కార్డులు మంజూరు చేశామన్నారు. వీరు తమ పంటలకు ఇన్సూరెన్స్ చెల్లిస్తే పంట నష్టం సంభవిస్తే ఇన్సూరెన్స్ వస్తుందని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్‌కి పంటల బీమాకి సంబంధించి గ్రామం ఒక యూనిట్‌గా పరిగణించి వరికి 200 రూపాయలు చొప్పున ఆగస్టు 15వ తారీకు లోపు చెల్లించాలన్నారు. మొక్కజొన్నకు మండలం ఒక యూనిట్‌గా పరిగణించి 165 రూపాయలు జూలై 31వ తేదీ లోపల చెల్లించాలన్నారు. నువ్వులు మండలం ఒక యూనిట్‌గా పరిగణించి 65 రూపాయల చొప్పున జూలై 31వ తేదీ లోపల చెల్లించాలన్నారు. కవులు రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని డి.గదబవలస గ్రామంలో కాంట్రాక్టు విద్యుత్ పనులు చేస్తుండగా సోమవారం విద్యుత్ షాక్ తగిలి పోరాపు రామకృష్ణ (19) మృతి చెందాడు. ఈయన గంగన్నపాడు గ్రామానికి చెందిన వ్యక్తి. విద్యుత్ పనుల కోసం కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు పై స్థానిక ఎస్ఐ జి.సాగర్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

లారీ బోల్తా

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జామి మండలం అలమండ సమీపంలో సోమవారం విశాఖపట్నం నుంచి రాయపూర్ బొగ్గులోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన లారీ డ్రైవర్ ను చికిత్స నిమిత్తం అలమండ ఆసుపత్రికి తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10వేలు జరిమానా

ప్రజాశక్తి - రామభద్రపురం

డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడ్డ మండల పరిధిలోని చిన నేరేళ్లవలసకు చెందిన వ్యక్తికి సాలూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయమూర్తి సోమవారం రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా ఉంచామని మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు, శిక్షలు తప్పవని హెచ్చరించారు.